## ఎమ్మెల్యే చిట్టెంపై కార్యకర్తల అభిమానం

- ఎన్నికల ఖర్చుకు రూ.25వేల నగదు అందజేత



ఎమ్మెల్యే చిట్టెంకు ఎన్నికల నగదును అందజేస్తున్న కార్యకర్తలు

మక్తల్‌టౌన్, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల ఖర్చు కోసం తమ ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి రూ.25వేల నగదు అందజేసి పార్టీ కార్యకర్తలు తమ అభిమానం చాటారు. మక్తల్ మండలం గుర్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు గాల్‌రెడ్డి, శేఖర్, అశోక్, పోర్ల ఆశప్ప, హన్మంతు తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం దంపతులను కలిసి రూ. 25వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 నుంచి ఎమ్మెల్యే చిట్టెం వెంటే ఉంటున్నామని నాటి నుంచి తమను కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తూ, నియోజకవర్గాన్నే ఇంటిగా భావించి, ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తీరుస్తున్న ఎమ్మెల్యేకు ఉడతా భక్తిగా ఎన్నికల ఖర్చుకోసం రూ.25వేలు అందజేశామన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, రైతుబంధు సమితి సభ్యురాలు చిట్టెం సుచరితా రెడ్డి, గుర్లపల్లి బీఆర్‌ఎస్ నాయకులు తమ్మప్ప, మల్లేశ్, కృష్ణ, వెంకటేశ్, మహేందర్, హన్మంతు, రాము తదితరులు ఉన్నారు.

## ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్‌మిట్టల్

మక్తల్‌టౌన్, అక్టోబర్ 27: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మక్తల్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదాం చుట్టుపక్కల స్టేడియం మైదానం ఉన్నందువల్ల గోదాం వైపు ఎవరూ రాకుండా గేట్ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తాసిల్దార్ సువర్ణారాజ్, మున్సిపల్ కమిషనర్ బల్‌రాం నాయక్, ఏఈ నాగశివ ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

- వనపర్తి జిల్లా విద్యాధికారి నరహరి

ఆత్మకూరు, అక్టోబర్ 27: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా విద్యాధికారి నరహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, జాతర మైదానం పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు తదితర వసతులను పరిశీలించారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి నైపుణ్యాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్, జీహెచ్ ఎం బాలరాజు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఊట్కూర్, అక్టోబర్ 27: మండలంలోని బిజ్జారం, పులిమామిడి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రమేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మరుగు దొడ్లు, ర్యాంప్‌ల నిర్మాణం, ఫ్యాన్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

### మాగనూర్‌లో...

మాగనూర్, అక్టోబర్ 27: మండలంలోని గురురావులింగంపల్లి, మందిపల్లి, వర్కూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో శశికళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

# పార్టీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలి

- ప్రభుత్వ పథకాలను గడప గడపకూ వివరించాలి
- ఎమ్మెల్యే చిట్టెం తనయుడు చాణిక్యరెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టెం చాణిక్యరెడ్డి

కృష్ణ, అక్టోబర్ 27 : వచ్చే ఎన్నికల్లో పార్టీ హ్యాట్రిక్ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ యువనాయకుడు, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తనయుడు చాణిక్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుసుమూర్తి, గురుజాల గ్రామాల్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సీఎం కేసీఆర్ సహకారంతో గత పదేండ్లలో మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపారన్నారు. అభివృద్ధి ప్రదాత బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెంను ఆదరించి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌పాటిల్, కృష్ణ మండల ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శివపాటిల్, మోనేశ్, ఆంజనేయులు, విజయ్‌గౌడ్, అమరేశ్, శంకరప్ప, సురేశ్, వెంకటేశ్, సంతోశ్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపులో భాగస్వామ్యం కావాలి

- టీపీసీ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప

మక్తల్ టౌన్, అక్టోబర్27: మక్తల్‌నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపులో ప్రతి కార్యకర్త భాగస్వామ్యమై భారీ మెజార్టీ అందించాలని టీపీసీ మాజీచైర్మన్ దేవరి మల్లప్ప అన్నారు. శుక్రవారం ఆయన మక్తల్‌లో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. వచ్చే నెల 30న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు వివరిస్తూ వారి బండారాన్ని బయటపెట్టాలని సూచించారు. మక్తల్ గడ్డపై చిట్టెం విజయాన్ని ఆపడం ఎవరితరం కాదని అన్నారు.

## ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- వనపర్తి ఎస్పీ రక్షితాకేమూర్తి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రక్షిత కె మూర్తి

ఆత్మకూరు, అక్టోబర్ 27:శాసనసభ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ రక్షితాకె.మూర్తి కోరారు. శుక్రవారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా, వివాదాలకు దారితీసే, గొడవలకు ఉసిగొలిపే పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎనికల నిబంధనలు పాటించకున్నా, గొడవలు సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఆమె వెంట సీఐ కే. ఎస్. రత్నం, ఎస్సై నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా చెక్‌పోస్టుల ఏర్పాటు

అమరచింత, అక్టోబర్27: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో నగదు, మద్యంతో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా పకడ్బందీగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని రక్షితాకేమూర్తి అన్నారు. శుక్రవారం ఆమె ఆత్మకూర్ సీఐ కే.ఎస్.రత్నం, అమరచింత ఎస్సై జగన్మోహన్‌తో కలిసి మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారులో ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టును, మండలం కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ త్వర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.కోటి 28 లక్షల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకుని ఎన్నికల కమిషన్ అధికారులకు అప్పగించామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నియమావళి పాటించాలని, వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డబ్బు, మద్యం తరలిస్తే చర్యలు

ఊట్కూర్, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై గోకరి హెచ్చరించారు. శుక్రవారం ఊట్కూర్, సంస్థాపూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు రామాంజనేయులు, విజయ్‌నాయక్, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### చెరుకు రైతు సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, అక్టోబర్ 27: చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న తెలిపారు. శుక్రవారం అమరచింత పట్టణ శివారులో ఏర్పాటు చేసిన చెరుకు రైతుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే చాలా సార్లు యాజమాన్యానికి చెరుకు రైతుల సమస్యలను విన్నవించామన్నారు. పంట కోతకు రావడంతో మరో సారి రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో లేబర్ బ్యాచ్‌లను పంపించాలని, గిట్టుబాటు ధరతో పాటు సమస్యలు పరిష్కరించాలని ఫ్యాక్టరీ ఈడీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేయగా ఆయన మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన చెరుకు రైతులు పాల్గొన్నారు.

## నేడు ఆంజనేయస్వామి పల్లకీ సేవ

మక్తల్, అక్టోబర్ 27: పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త భీమాచార్య, ఈవో శ్యాంసుందరాచారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 2:55 గంటల నుంచి ఆలయం మూసివేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారికి నిత్యపూజా కార్యక్రమాలు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు.

## జూరాల కాల్వకు గండి

ఆత్మకూరు, అక్టోబర్ 27: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాల్ -6కు శుక్రవారం తెల్లవారు జామున గండిపడింది. గుర్తించిన దిగువ పొలం రైతు కుమ్మరి చెన్నయ్య వెంటనే నాయకులు, అధికారులకు సమాచారమందించాడు. అధికారులు స్పందించకపోవడంతో రైతులే డిస్ట్రిబ్యూటరీ కెనాల్ గేట్ మూసివేశారు. అప్పటికే పెద్ద ఎత్తున నీరు లోతట్టు ప్రాంతాలకు చేరుకున్నది. కాల్వ పక్కనే ఉన్న కుమ్మరి చెన్నయ్య వరిపైరు దెబ్బతింది. అధికారులు ముందుగా స్పందించిఉంటే పొట్టదశకు వచ్చిన పంట దెబ్బతినేది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు కాల్వకు పడ్డ గండిని పూడ్చే చర్యలు చేపట్టారు.

## రూ.1.30 లక్షలు స్వాధీనం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మాగనూర్, అక్టోబర్ 27: మండలంలోని ఉజ్జెల్లి గ్రామ చెక్ పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించగా రూ.లక్షా 30వేలు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. మాగనూర్ మండలం గుజరందొడ్డికి చెందిన కుమ్మరి లింగప్ప కర్ణాటక రాష్ట్రంలోని అజులపూర్ నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా తనిఖీ చేయగా రూ. లక్షా 30వేలు పట్టుబడ్డాయన్నారు. నగదుకు తగిన పత్రాలు లేక పోవడంతో సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ ట్రెజరీకి పంపించామని ఏఎస్సై మన్సూర్ తెలిపారు.